క్లుప్తంగా

కొత్త అడ్మిషన్లు పెరిగాయి

ఎంఈఓ శంకర్



కొత్తగా అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థులు

పుల్‌కల్(అందోల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే పెరిగిందని ఎంఈఓ శంకర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హనుమానాయక్ తండాలో పాఠశాలను తనిఖీ చేశారు. ఈ పాఠశాలలలో కొత్తగా ముగ్గురు విద్యార్థులు జాయిన్ అవ్వడంతో వారికి కొత్త దుస్తులు , పుస్తకాలు పంపిణీ చేశారు.

పరిసరాల శుభ్రత బాధ్యత

కమిషనర్ మధుసూదన్ రెడ్డి



అవగాహన కల్పిస్తున్న మధుసూదన్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సోమవారం పట్టణ పరిధిలోని 3వ వార్డులో కమిషనర్ మధుసూదన్ రెడ్డి సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడంతో అనారోగ్య సమస్యను నివారించవచ్చన్నారు. జనావాసాల మధ్య చెత్తను పారబోస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ విజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

సంగారెడ్డి : చౌటకూర్ మండలంలోని బొమ్మరెడ్డి గూడెంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాయక్ గ్రామపెద్దలు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు కొలతలు చేసి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా రఘునాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విడతల వారీగా రూ.5 లక్షలు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేస్తుందన్నారు. ఇళ్లు మంజూరయిన లబ్ధిదారులు నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థిని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ తీర్పగల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దుర్వాస్ నాయక్, నాయకులు ల్గొన్నారు.

పటాన్‌చెరులో జోనల్ కమిషనర్ పర్యటన



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే పర్యటించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌తో సమావేశమయ్యారు. డివిజన్‌లో పెండింగ్ పనులు, నెలకొన్న సమస్యలను జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు. వర్షాలకు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వరదనీరు తరలింపునకు అంతర్గత పైపులైన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. డివిజన్ పరిధిలోని నందన్ రతన్ ఫ్రైడ్ కాలనీ అభివృద్ధి పనులకు రూ.47 లక్షల నిధులు మంజూరు చేసినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేసి జోనల్ కమిషనర్ హేమంత్‌ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్ నాయక్,డీసీ సురేష్ ,ఈఈ సురేష్ ,డీఈ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

సంగారెడ్డి : రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ..రాజీవ్ యువ వికాస్ పథకానికి రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత 16లక్షల25వేల మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న నిధులు మంజూరు చేస్తామని ప్రకటించి వాయిదా వేయడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు.

రాళ్లభూముల్లో రతనాల సాగు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట

- ప్రభుత్వ పథకాల అమలు
- గట్టు, రాళ్ల భూముల్లో పత్తిసాగు చేస్తున్న అన్నదాతలు



రాళ్ల భూముల్లో పత్తి సాగు చేస్తున్న రైతులు

రాయికోడ్(అందోల్): రెండు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలను అమలు చేస్తూ సాగుకు ఆర్థిక సహాయం అందజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొన్ని దశాబ్దాలుగా బీడు భూములుగా ఉన్న నేలలు సాగులోకి వస్తున్నాయి. సాగుకు యోగ్యం కావని భావించిన రాళ్ల భూముల్లో రైతులు కొన్ని సంవత్సరాలుగా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. పంటల సాగు కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా రూ. 6 వేల చొప్పున సాగుకు పెట్టుబడి అందిస్తుంది. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎకరాకు ఏడాదికి 10 వేల రూపాయల చొప్పున, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలు పెట్టుబడుల కోసం ఆర్థిక సహాయం అందిస్తోంది. దీంతో గట్టురాళ్ల భూములు క్రమంగా సాగులోకి వస్తున్నాయి. గతంలో సాగుకు పనికి రావని బీడుగా వదిలేసిన భూముల్లో ప్రస్తుతం పత్తి, కంది, పెసర, మినుప పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకుని చేనులో రాళ్లను ఎరించడం, చెరువు మట్టిని రాళ్ల భూముల్లో వేయించి సారం పెంచుకోవడం తదితర పనులను రైతులు చేస్తున్నారు. దీంతో క్రమంగా రాళ్లగుట్ట భూములు సారవంతం అవుతున్నాయి. మండలంలో ఏడాదికేడాది పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. వ్యవసాయ అధికారులు భూముల రకాలను బట్టి ఎరువుల వినియోగంపై సలహాలు, సూచనలు చేస్తూ రైతులకు సాగులో సేవలందిస్తున్నారు. మండలంలో 40 వేల ఎకరాలలో రైతులు పంటల సాగు చేస్తున్నారు. వాటిలో 20 శాతం భూములు గతం కంటే సాగులోకి వచ్చాయి. అందులో గట్టుభూములు, రాళ్ల భూములు ఉన్నాయి.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఏడీఏ వెంకటలక్ష్మి



ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న ఏడీఏ

సంగారెడ్డి టౌన్ : విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఏడీఏ వెంకటలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాదారులు ఎరువులు, విత్తనాలను విక్రయించినప్పుడు రైతులకు కచ్చితంగా రసీదును ఇవ్వాలని.. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే అమ్మాలని సూచించారు. స్టాక్‌బోర్డుపై వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పొందుపరచాలని తెలిపారు. అనంతరం బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ర్యూన్సీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



రోడ్డు పక్కన జేసీబీతో తొలగిస్తున్న చెత్త

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గౌలిగల్లీ, మార్వాడీ గల్లీ, కిష్టయ్యమాస్టర్ గల్లీ, కోర్టుకాలనీ, కూరగాయల మార్కెట్‌లో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగును పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఎక్సైజ్ కార్యాలయం నుంచి వెంకట్‌రెడ్డి చౌక్ వరకు.. బైపాస్ రోడ్డుకు ఇరుపక్కలా పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించే పనులను చేపట్టారు. పలు వార్డుల్లో తడి, పొడి చెత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పాడైన వీధిదీపాలకు మరమ్మతులు చేపట్టారు. ఆయా పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం .. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 35 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 29 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున, ముగ్గురికి రూ.2 వేలు, మరో ఇద్దరికి రూ.1500, ఒకరికి రూ.3వేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..



ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న చెత్త కుప్పలు

సంగారెడ్డి టౌన్ : పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. పలు కాలనీల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. 100 రోజుల ప్రణాళికను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని పలు కాలనీవాసులు వాపోతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



హరీశ్‌రావును స్వాగతం పలుకుతున్న గోవర్ధన్‌రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మెదక్ జిల్లాలోని నర్సాపూర్ పర్యటనకు వెళ్తున్న ఆయనకు గుమ్మడిదల టోల్ ప్లాజా వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పరిపాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల మధ్యలో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సంతోష్ రెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాస్ చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

సంగారెడ్డి: కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మధుమదన్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లలో పని చేస్తున్న గృహ కార్మికులకు నాయకత్వ లక్షణాలు, గృహహింస, కార్మిక హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తోటి వారి సమస్యలను తమ సమస్యలుగా భావించి స్పందించాలని, అవసరమైన సహాయం అందించాలన్నారు. డొమెస్టిక్ వర్కర్స్, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పటాన్‌చెరు: పటాన్‌చెరు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏఈ జగదీశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాంతినగర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టింబర్ డిపో రోడ్డు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆటో డ్రైవర్‌ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో ఆటో స్టాండ్ కోసం స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ కారణంగా ఆటోలను నిలపడం ఇబ్బందికరంగా ఉందని ఆటో డ్రైవర్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఉచిత బస్సు కారణం తమకు ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లింగంపల్లిలో శాశ్వత ప్రాతిపదికన ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. నిబంధనల పేరుతో ఆటోడ్రైవర్‌లను ఇబ్బంది పెట్టకూడదని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ట్రాఫిక్ అధికారులను సూచించారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల డీఈ రామకృష్ణ, మాజీ ఎంపీపీ యాదగిరి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ , నాయకులు నగేశ్, గూడెం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

పటాన్‌చెరు: పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తీలోని పోచమ్మ తల్లి దేవాలయ ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రభాకర్

పటాన్‌చెరు టౌన్: యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినాయక రెడ్డిల నేతృత్వంలో, దాదాపు 30 మంది పోలీసు సిబ్బంది గీతం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ... మాదకద్రవ్యా వినియోగం యొక్క తీవ్రమైన పరిణామాలను ప్రస్తావిస్తూ, మాదకద్రవ్య, సైకోట్రోపిక్ పదార్థాల హానికరమైన ప్రభావాలను వివరించారు. విద్యార్థులు, యువత అప్రమత్తంగా,బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ మంజునాథాచారి, ప్రొఫెసర్ త్రినాథరావు, ఎస్టేట్ అధికారి డీవీఏ మోహన్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో ప్రాణహాని

నారాయణఖేడ్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణ శివార్లలోని జ్యోతిబాఫూలే బాలుర పాఠశాలలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలతో పెడదోవ పట్టేందుకు ఆస్కారం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

జహీరాబాద్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సైదా సూచించారు. సోమవారం పట్టణంలోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలన్నారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితమే నాశనం అవుతుందన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

మత్తు పదార్థాల వినియోగంతో నష్టం



మొక్కలు నాటుతున్న డీఎస్పీ సైదా

న్యాల్‌కల్(జహీరాబాద్): మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులకు వివరించాలని జహీరాబాద్ రూరల్ సీఐ జెక్కుల హన్మంతు విద్యార్థులకు సూచించారు.న్యాల్‌కల్‌లోని శ్రీవాణి హైస్కూల్ ఆవరణలో మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమంపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేశారు. సీఐ మాట్లాడుతూ.. గంజాయి వినియోగించడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని రోగాల బారిన పడాల్సివస్తుందన్నారు. మత్తు పదార్థాల వాడకం, అక్రమ రవాణా గురించి తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908కి సమాచారం అందించాలని కోరారు. అనంతరం సీఐ హన్మంతు, ఎస్ఐ, సిబ్బందితో కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటా రు. కార్యక్రమంలో హద్నూర్ ఎస్ఐ చల్లా రాజశేఖర్, పోలీస్‌లు, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

జహీరాబాద్ టౌన్: పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని మండలంలోని బూచినెల్లి గ్రామ రైతులు కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్‌తో కలిసి సోమవారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. 65వ జాతీయ రహదారికి అనుకున్న ఉన్న విలువైన భూములను రైతులు పరిశ్రమల కోసం ఇచ్చారని చెప్పారు. భూములు కోల్పోయిన వారికి పరిశ్రమల్లో పర్మినెంట్ ఉద్యోగం, ఎకరానికి 120 గజాల ప్లాట్ కూడా ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. భూబాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, లేనియెడల ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ సిటీ స్కాన్ ఏర్పాటు చేయండి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు దుర్గప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ప్రభుత్వ ఆస్పత్రి ఉందని, ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారని చెప్పారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్‌లేక ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. డయాలసిస్ మిషన్‌లు కూడా తక్కువగా ఉన్నాయన్నారు. సిటీ స్కాన్‌తో పాటు మరో డయాలసిస్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

◆ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

టేక్మాల్(మెదక్): నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం టేక్మాల్ రైతువేదికలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర ఆదేశాల మేరకు రూ.15 లక్షల విలువ గల 41చెక్కులను అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో పేదలందరికీ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, టేక్మాల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భక్తుల కిషోర్, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

◆ చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం వెంకటాపూర్ చౌక్ సమీపంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, మహాహారతి, పుష్పాభిషేకం, పుష్పార్చన, గీతాపారాయణం, హనుమాన్ చాలీసా, లలితాసహస్ర నామావళి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గీత నేర్చుకో తలరాత మార్చుకో కార్యక్రమంలో భాగంగా ప్రధాన అర్చకుడికి శివశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ భగవత్‌గీత పుస్తకాన్ని బహూకరించారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడి సతీష్ సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రూ. 10.50 లక్షలు మంజూరయ్యాయి. మంత్రి దామోదర రాజనర్సింహ్మ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

◆ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కార్పొరేటర్ పుష్ప మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరారు.

◆ నేడు దయల్ యువర్ డీఎం

జహీరాబాద్: దయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు జహీరాబాద్ ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్ టీ.స్వామి తెలిపారు. సా. 4 నుంచి 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, సందేహాలు తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా సూచనలు, సలహాలు కూడా ఇవ్వవచ్చన్నారు. ఇందుకు 9959226268 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

◆ నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

సదాశివపేట రూరల్,(సంగారెడ్డి): ఇళ్లు లేని ప్రతి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందిస్తోందని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకేనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు దేశానికి ఆదర్శమన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలను కేటాయించడం దేశంలో మరెక్కడా లేదన్నారు. అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



మొక్కలు నాటుతున్న జగన్నాథ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ నాయకులు సోమవారం నిర్వహించారు. మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి జగన్నాథ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పిలుపు మేరకు గ్రామంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామన్న, మల్లికార్జున్ స్వామి, సుదర్శన్‌రెడ్డి, తుక్కప్ప, ఓంకార్, రాజిరెడ్డి, సంగమేశ్వర్, వినయ్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ఆశయాలకు అనుగుణంగా పాలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు. సోమవారం శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో అంతర్భాంగంగా ఉన్న కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. ఒకే దేశంలో రెండు జెండాలు రెండు రాజ్యాంగాలు ఉండడాన్ని నిరసిస్తూ ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చారని గుర్తు చేశారు. భారత దేశంలో అంతర్భాభాగంగా వున్న కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి భారత పౌరులందరికీ అర్హత ఉందని పోరాటం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, అంజిరెడ్డి, సీనియర్ నాయకులు రాజేశ్వర్ రావు దేశ్ పాండే , జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి ,జిల్లా ఉపాధ్యక్షులు పోచారం రాములు , వెంకట నరసింహ రెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి రాజు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.